

పవన్‌కు ఘన స్వాగతం


పొన్నాల వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్

సిద్దిపేట అర్బన్/ములుగు, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు సిద్దిపేట జిల్లా సరిహద్దులో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల నిమిత్తం ఆయన కరీంనగర్ జిల్లా కొండగట్టు హనుమాన్ ఆలయానికి వెళ్తుండగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, ములుగు మండలం వంటిమామిడి, వర్గల్ వద్ద అభిమానులు స్వాగతం పలికారు. పొన్నాల వద్ద తెలంగాణ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన సిద్దిపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాసరి పవన్ ఆధ్వర్యంలో అభిమానులు పెద్దఎత్తున రహదారిపైకి చేరుకున్నారు. పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతూ నినాదాలు చేశారు. అభిమానుల కోరిక మేరకు పవన్‌కల్యాణ్ కారు నుంచి బయటకు వచ్చి గజమాల స్వీకరించి అభివాదం చేస్తూ విజయ సూచికను చూపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో దాసరి పవన్‌తోపాటు అభిమానులు పాల్గొన్నారు. ములుగు మండలం వంటిమామిడి వద్ద అభిమానులు, బీజేపీ నాయకులు పవన్ కల్యాణ్‌ను శాలువాతో సత్కరించారు.

గిజిగాడి గూడు.. కొమ్మకొమ్మన చూడు

పిట్టలు, పిచ్చుకలు చెట్టు కొమ్మన ఒక్కో గడ్డిపోచతో ఆకర్షణీయంగా గూళ్లను తీర్చిదిద్దుకుని అందులో తలదాచుకుంటాయి. అటు నింగికి ఇటు నేలకు మధ్యన ఊగిసలాడుతూ చూడముచ్చటగా కనిపిస్తాయి. ఒకటి, రెండు గూళ్లను చూస్తేనే ఆశ్చర్యానికి లోనవుతాం. అలాంటిది అనేకం ఒకే చోట కనిపిస్తే పొందే పరవశం చెప్పలేనిది. కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామంలోని కానుగుల శ్రీనివాస్ వ్యవసాయబావి వద్ద ఉన్న కొబ్బరిచెట్టు కొమ్మల నిండా గిజిగాడి గూళ్లు విరివిగా కట్టుకోవడాన్ని చూసి రైతులు, ప్రయాణికులు అనుభూతిని పొందుతున్నారు.

- చేర్యాల, జూన్ 29



కష్టాల్లో కార్యదర్శులు

'తాను విధులు నిర్వహించే గ్రామపంచాయతీలో నిధులు లేక ఒక కార్యదర్శి 4 నెలలుగా ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాల కొనుగోలు, ఇతరత్రా మరమ్మతుల కోసం సొంతంగా రూ.40వేలు ఖర్చు చేశాడు. ఈ ఆర్థిక భారంతోపాటు అధికారులు అప్పగిస్తున్న సర్వేలతో అదనపు భారం మోస్తున్నాడు. ఏడు నెలలుగా సఫాయి కార్మికులకు జీతాలు రాకపోవడంతో వారిని బతిమిలాడి పని చేయించుకుంటున్న పరిస్థితి.'

ఈ దుస్థితి జిల్లాలోని దాదాపు గ్రామపంచాయతీ కార్యదర్శులంతా అనుభవిస్తున్నట్లుగా తెలుస్తున్నది. పంచాయతీ పాలకవర్గాలు లేక ఇప్పటికే ఆరునెలలు కావొస్తుంది. ప్రత్యేక అధికారులు ఉన్నారంటే ఉన్నారన్నట్లుగానే ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కథానాయకుడై నడిపించాల్సిన కార్యదర్శే ప్రస్తుతం కష్టాల్లో ఉండడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్29



- గ్రామ పంచాయతీల్లోనే పుట్టెడు సమస్యలు
- నిధులు రాక సొంత డబ్బు వెచ్చిస్తున్న వైనం
- దీనికితోడు సర్వేలతో అదనపు భారం
- ఏడు నెలలుగా సఫాయిలకు అందని వేతనాలు
- పాలకవర్గాలు లేవు.. ప్రత్యేకాధికారులు పట్టించుకోరు
- సర్వేలను బహిష్కరించేందుకు సమాయత్తం



సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో గ్రామాల అభివృద్ధి పనులు, మరమ్మతులు, నిధుల వ్యవహారమంతా సర్పంచ్‌లు, పాలకవర్గాలు చూసుకునేది. కానీ గడిచిన జనవరి నెలాఖరుతో పాలకవర్గాల గడువు పూర్తయ్యింది. ఆ వెంటనే ప్రతీ గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. ఇతర శాఖల్లో కీలకంగా ఉన్నవారికే ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలపై సరైన దృష్టి పెట్టడంలేదు. తమ మాతృ శాఖలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎప్పుడో ఒకసారి గ్రామాలకు వస్తున్నప్పటికీ సలహాలు, సూచనలకే పరిమితమవుతున్నారు. దీంతో భారమంతా స్థానికంగా ఉండే పంచాయతీ కార్యదర్శిపైనే పడుతోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు మరమ్మతులు, గ్రామ నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, పన్నుల వసూళ్లు, ఆదాయ, వ్యయాల లావాదేవీలు, నెలవారి చెల్లింపులు తదితర విషయాలన్నీ వీరే పర్యవేక్షించాల్సి వస్తోంది. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

వేధిస్తున్న నిధుల కొరత

గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర, రాష్ట్రాల నిధులు ఆగిపోయాయి. దీంతో చాలా పంచాయతీల ఖాతాల్లో నిధుల కొరత ఏర్పడింది. తాజాగా జడ్పీ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి స్వయంగా ఈ విషయాన్ని అంగీకరించక తప్పలేదు. మాజీ మంత్రి హరీశ్‌రావు సమీక్షిస్తూ సఫాయి కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు ఎందుకివ్వడం లేదని, ట్రాక్టర్ల నెల వాయిదాలు ఎందుకు చెల్లించడం లేదని అడిగిన సందర్భంలో ఆమె బదులిచ్చారు. వీధి దీపాలకు సంబంధించిన బిల్లులు సైతం విద్యుత్ శాఖకు బకాయి పడుతున్నారు. ఇక వసూలైన పన్నులు, ఇతరత్రా ఆదాయం సాధారణ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏదైనా మరమ్మతులు, అత్యవసర అవసరాలకు పంచాయతీ కార్యదర్శులే తమ జేబులో నుంచి ఖర్చు చేసి ఆ తర్వాత లెక్క సరిచేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇటు పాలకవర్గాలు లేక, అటు గ్రాంట్లు, నిధులు రాక, మరోవైపు ప్రత్యేకాధికారులు పట్టించుకోక నలిగిపోతున్నామనే బాధ కార్యదర్శుల్లో వ్యక్తమవుతోంది.

'సర్వే'లపై గరంగరం

పంచాయతీల నిర్వహణకు తోడు ఇటీవల పలు క్షేత్రస్థాయి సర్వేలలో కార్యదర్శులను భాగస్వాములుగా చేస్తున్నారు. దీంతో పని భారంతోపాటు మానసిక ఒత్తిడి పెరిగిందని చెబుతున్నారు. తమ శాఖలకు సంబంధం లేని సర్వేలు అంటగడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇంటింటా మిషన్ భగీరథ నల్లాలు వివరాలను నమోదు చేసే విషయంలో కార్యదర్శులే కీలకంగా వ్యవహరించారు. రోజువారీ పనులు నిర్వహిస్తూనే భగీరథ సర్వే నిర్వహించారు. తాజాగా వ్యవసాయ సర్వే భారం కూడా పడనున్నట్లుగా తెలుస్తోంది. ప్రతీ గ్రామంలో సాగు చేయని భూముల వివరాలను పారదర్శకంగా అందించాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీనిపై కార్యదర్శులు ఆగ్రహంతో ఉన్నారు. పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర యూనియన్ తరఫున ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. సర్వేల నుంచి మినహాయించాలని కోరుతున్నారు.

15 లక్షల మొక్కలు నాటాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి షఫీ ఉల్లాఖాన్


మాట్లాడుతున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి షఫీ

సిద్దిపేట అగ్రికల్చర్ జూన్ 29: వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో 15 లక్షల మొక్కలను నాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి షఫీ ఉల్లాఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలోని గజ్వేల్ మండలంలోని దాచారం, దిలాల్పూర్, చేర్యాల మండలంలోని వీరన్నపేట, కొత్తదమ్మాట, సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్న గుండవెల్లి, తోర్నాల గ్రామాల్లో పర్యటించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా అన్ని రంగాల్లో రాష్ట్రానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని, అందరికీ అభినందనలు తెలిపారు. ప్రతీ అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని మొక్కలు నాటాలని సూచించారు. ప్రతీ మొక్కను జియోట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. గతంలో నాటిన మొక్కలను కరెంటు స్తంభాల వైర్లకు తగలకూడదని కట్ చేయడం బాధాకరమని, ఇలాంటివి జరగకుండా ముందస్తుగా ఆలోచించి మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'చామల'పైనే చేర్యాల ఆశలు

- రెవెన్యూ డివిజన్.. నియోజకవర్గ ఏర్పాటుపై హామీ
- మల్లన్న దర్శనార్థం తొలిసారి రాక

చేర్యాల, జూన్ 29 : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై చేర్యాల ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. తనను గెలిపిస్తే అండగా ఉండి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, నియోజకవర్గ సాధనకు పాటుపడతానని పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారానికి ముందు కొమురవెల్లి మల్లన్నకు ముడుపు కట్టిన చామల గెలిచిన అనంతరం ఆదివారం తొలిసారి మల్లన్న ఆలయానికి రాబోతున్నారు. మొక్కుబడి తీర్చుకోనున్న మాదిరిగానే చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాలని ఆకాంక్షిస్తున్నారు. చామల సీఎం రేవంత్‌రెడ్డికి సుపరిచితుడైనందున ఇక్కడి పరిస్థితిని ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

బేకరీలో కుళ్లిన కేక్‌ల విక్రయం


కమిషనర్‌కు అందిన ఫిర్యాదుతో తనిఖీలు, రూ.10వేల జరిమానా


కుళ్లిన కేక్‌ను విక్రయించిన ప్రజ్ఞాపూర్‌లోని బేకరీ యజమానికి జరిమానా రశీదును అందజేస్తున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్

గజ్వేల్, జూన్ 29: బేకరీలో కుళ్లిన కేక్‌లను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదేశాల మేరకు ప్రజ్ఞాపూర్‌లోని ఓ బేకరీలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తనిఖీలు నిర్వహించారు. బేకరీలో కుళ్లిపోయిన కేక్, వ్యాలిడిటీ అయిపోయిన కూల్‌డ్రింక్స్‌ను గుర్తించి వాటిని చెత్త వాహనంలో వేశారు. అనంతరం బేకరీ యజమానికి రూ.10వేల జరిమానా విధించారు. ఇకపై పట్టణంలోని హోటళ్లలో, బేకరీల్లో, ఆహార పదార్థాలు లభించే దుకాణాలలో కాలం చెల్లిన వాటిని విక్రయించినా, పరిశుభ్రత లేకపోయినా మున్సిపల్ యాక్ట్-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ నర్సయ్య హెచ్చరించారు.

ఇసుక డంపుల స్వాధీనం

18 ప్రాంతాల్లో 190 ట్రిప్పులు


నంగునూరు శివారులోని మామిడి తోటలో పెద్దఎత్తున నిల్వచేసిన ఇసుక డంపులను చూపిస్తున్న పోలీసులు

నంగునూరు, జూన్ 29 : నంగునూరు కేంద్రంగా నడుస్తున్న ఇసుక దందాకు చెక్‌పెట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎలాంటి అనుమతి లేకుండా మండలంలోని పెద్దవాగు నుంచి తరలిస్తున్న ఇసుక రవాణాపై దాడులు కొనసాగుతున్నాయి. కొంతమంది అక్కెనపల్లి (మోయ తుమ్మెద), పెద్ద వాగుల నుంచి ఇసుకను తరలించి వ్యవసాయ బావుల వద్ద నిల్వ చేసిన డంపులను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాలపేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నంగునూరు గ్రామంలోని చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్ద, గ్రామ శివారులోని రామాలయం బండ చుట్టూ, బండ మీద, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పెద్దఎత్తున డంపులను గుర్తించామని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో 18 చోట్ల నిలువ చేసిన ఇసుక డంపులపై దాడి చేసి సుమారు 190 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తగు చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేస్తే..

ఎన్నాళ్ల నుంచో ఇసుక అక్రమ రవాణా, వ్యాపారుల ఆగడాలపై మండలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా ఇంత పెద్దఎత్తున ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. బహిరంగంగానే ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాను కొనసాగిస్తుంటే నాయకుల ఒత్తిడితో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిగా ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

కుక్కల దాడిలో 14 జీవాలు మృతి

చిన్నకోడూరు, జూన్ 29 : కుక్కల దాడిలో 14 జీవాలు మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గోనెపల్లి గ్రామానికి చెందిన రైతు పేర్నా కుంటయ్య ఇంటికి సమీపంలో ఇనుప జాలీతో కూడిన పెన్సింగ్‌ను ఏర్పాటు చేసి గొర్రెలు, మేకలను పెంచుతున్నాడు. కుంటయ్య రోజు మాదిరిగానే శనివారం మధ్యాహ్నం నెల వయస్సు ఉన్న గొర్రెలు, మేక పిల్లలను పెన్సింగ్‌లో ఉంచి మిగతా జీవాలను మేపడానికి తోలుకెళ్లాడు. ఈ క్రమంలోనే పెన్సింగ్ లోపలికి కుక్కలు చొరబడి జీవాలపై దాడి చేయగా 14 మృతి చెందాయి. జీవాల అరుపులకు స్థానికులు అక్కడికి చేరుకుని కుక్కలను వెళ్లగొట్టారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

రేపటి నుంచి ఆపరేషన్ ముస్కాన్ : సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 29 : జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అధికారులకు సూచించారు. నేటి నుంచి జూలై 31 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా బాలకార్మికులను గుర్తించనున్నామని తెలిపారు. ఈ మేరకు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి సీపీ మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా ఇప్పటి వరకు 946 మంది పిల్లలను కాపాడినట్లు తెలిపారు. అన్ని విభాగాల అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. బాల కార్మికులు పనిచేసే స్పాట్లను గుర్తించి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్ పరిధిలో ఒక ఎస్‌ఐ, నలుగురు సిబ్బందిని నియమించినట్లు, వీరితో పాటు వివిధ విభాగాల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని ఆదేశించారు. బాలకార్మికులను గుర్తించినట్లయితే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి లేదా రిహాబిలిటేషన్ సెంటర్‌కు పిల్లలను పంపించాలన్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ కోర్ ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేరస్థులకు శిక్షలు పడేలా చూడాలి

నేరస్థులకు శిక్షలు పడేలా కోర్టు కానిస్టేబుళ్లు, డ్యూటీ అధికారులు పనిచేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. కోర్టు విధులు నిర్వర్తించే సిబ్బందితో శనివారం కమిషనర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడరు. మహిళ బాధితుల కేసులలో శిక్షల శాతం పెంచాలన్నారు. కానిస్టేబుళ్లు కోర్టు క్యాలెండర్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతీ కేసును క్షుణ్ణంగా పరిశోధించాలని, సాక్ష్యులను ధైర్యంగా ఉండేలా సూచనలు చేయాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం సాక్ష్యులను తప్పకుండా కోర్టులో హాజ


ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ

ఆయిల్‌పామ్ రైతులకు ఊరట

2023-24కు సంబంధించి ప్రోత్సాహకాలు విడుదల ● జిల్లాలో 8,200 ఎకరాలకు రూ.3.35 కోట్లు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 29 : ఎట్టకేలకు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల ఖాతాల్లో ప్రోత్సాహక నగదు జమైంది. జిల్లాలో సంప్రదాయ పంటల సాగుకు భిన్నంగా వాణిజ్య పంటల సాగు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే ఉద్యానవన శాఖ జిల్లాలోని రైతులను ఆయిల్‌పామ్ తోటల సాగువైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టింది. మూడేళ్ల క్రితం జిల్లాలో సాగును ప్రారంభించారు. ఆయిల్‌పామ్ తోటలతో మొదటి నాలుగేళ్లపాటు ఎలాంటి ఆదాయం వచ్చే అవకాశం లేదు. దీంతో నాలుగేళ్ల పాటు తోటల నిర్వహణ, ఎరువులు, ఇతర ఖర్చుల కోసం రైతులకు అండగా నిలవాలని గత ప్రభుత్వం భావించింది. అంతర పంటల సాగుకు వెసులుబాటు కల్పించింది. దీని కోసం ప్రోత్సాహక నగదు అందించాలని నిర్ణయించింది. ఆయిల్‌పామ్ తోటల నిర్వహణకు ఎకరానికి రూ.2100, అంతర పంటల సాగు కోసం అదనంగా రూ.2100 చెల్లిస్తున్నారు. అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉండటంతో రైతులు కొంతమేర ఇబ్బందులకు గురయ్యారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం సైతం నిధులు విడుదల చేయలేకపోయింది. ఇటీవల ఎన్నికల కోడ్ ముగియటంతో ప్రభుత్వం జిల్లాలోని 8,200 ఎకరాలకు రూ.3.35 కోట్ల నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా రైతు ఖాతాల్లో జమ

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు తోటల నిర్వహణ, అంతర పంటల సాగు కోసం అందించే ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది. నేరుగా రైతుల ఖాతాలో నిధులు జమయ్యాయి. జిల్లాలో మొత్తం 8200 ఎకరాలకు రూ.3.35 కోట్లు కాగా...మొదటి సంవత్సరం 5,500 ఎకరాలకు రూ.2.18 కోట్లు, రెండో సంవత్సరం 2,700 ఎకరాలకు రూ.1.17 కోట్లు నగదు జమ చేశారు.

- సువర్ణ, జిల్లా ఉద్యానవన అధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: నవీన్ మిట్టల్

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 29: ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు వెయ్యికి తగ్గకుండా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీ, సబ్సిడీ గ్యాస్ స్వాధీనం

● సివిల్ సప్లయ్ అధికారి ప్రణీత్‌రెడ్డి

శివ్వంపేట, జూన్ 29: సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మండల పరిధి దొంతి గ్రామంలోని ఓ హోటల్‌ను డిప్యూటీ డీఎస్‌వో ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐ కిషన్‌తో కలిసి శనివారం తనిఖీ చేసి.. గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సిలిండర్లు వ్యాపార వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



దొంతి హోటల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎస్‌వో ప్రణీత్‌రెడ్డి

కోర్టు కోసం భవనాల పరిశీలన



ఆర్డీవోతో మాట్లాడుతున్న లక్ష్మీశారద

తూప్రాన్, జూన్ 29: తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సంబంధించిన భవనాలను మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద శనివారం పరిశీలించారు. పట్టణానికి సాయంత్రం 6 గంటలకు విచ్చేసిన న్యాయమూర్తి రాత్రి 7.30 గంటల వరకు తూప్రాన్‌లోని పుట్టకోటలో ఉన్న బీసీ, ఎస్సీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. భవనానికి మరమ్మతులు అధికంగా ఉండడంతో నర్సాపూర్ చౌరస్తాలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం, టోల్‌ప్లాజా వద్దగల రోడ్లు భవనాలశాఖ అతిథి గృహం, తూప్రాన్ ఆర్డీవో కార్యాలయ భవనాలను పరిశీలించారు. పుట్టకోటలోని హాస్టల్ భవనాలు అనుకూలంగా ఉన్నా.. మరమ్మతుల ఖర్చులు అధికంగా అవుతాయని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. వారి వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతికృష్ణ, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం, రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్దార్‌సింగ్, కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు. పోతరాజుపల్లిలోని వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలలో ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నశివునూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు ఆర్డీవో జయచంద్రారెడ్డి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి చేనేత కార్మికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్, జూన్ 29: ఆగస్టు 7న చేనేత దినోత్సవారాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం చేనేత కళాకారుల కళా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత, జౌళిశాఖ జిల్లా సంచాలకులు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యం, ప్రత్యేకతల ఆధారంగా అందిస్తామని చెప్పారు. అవార్డు గ్రహీతలకు రూ.25వేల నగదు, చేనేత శాలువా, జ్ఞాపిక అందించి మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరిస్తామని వివరించారు. 2023 డిసెంబరు నాటికి 25 ఏళ్లు పైబడి ఐదేళ్ల అనుభవం తగ్గకుండా ఉండాలన్నారు. ఆసక్తి గల వారు జూలై 10వ తేదీలోగా సంచాలకులు, చేనేత జౌళిశాఖ సంగారెడ్డి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూలై 15వ తేదీలోగా దరఖాస్తుదారుని ఉత్పత్తిని, మగ్గంపై తనిఖీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

● 330 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్ స్వాధీనం



నిందితుల వివరాలను తెలుపుతున్న గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్, జూన్ 29: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన టంగుటూరి శివానంద్(22), హైదరాబాద్‌కు చెందిన జుమ్మెరాత్ బజార్, దూల్‌పేటకు చెందిన కుల్దీప్‌సింగ్(20), అనిత భాయ్(45)లు ముఠాగా ఏర్పడ్డారు. గజ్వేల్‌లోని పిడిచేడ్ రోడ్డులో శివాజీ విగ్రహం సమీపంలో టంగుటూరి శివానంద్ గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని సమాచారం రాగా సీఐ సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందితో వెళ్లి శివానంద్ వద్ద 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరి దగ్గరి నుంచి తీసుకొచ్చావని విచారించగా.. కుల్దీప్‌సింగ్, అనిత్‌బాయ్ పేర్లు తెలిపాడు. వర్గల్ మండలం గౌరారం బస్టాండ్ సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. వారినుంచి 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు పంపించారు.

డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు

జహీరాబాద్, జూన్ 29: 2023 సంవత్సరానికిగాను జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులో గల డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డా. వరప్రసాద్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యకు అవార్డులు, ప్రశంసాపత్రాలను ఇటీవల అందజేశారని కేవీకే శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలోని జాతీయ పొగాకు పరిశోధనాస్థానంలో తెలంగాణ, ఆంధ్రపదేశ్‌కు చెందిన 72 కేవీకేలకు చెందిన ప్రతినిధులు, పరిశోధనా సంస్థల డైరెక్టర్లతో సమావేశం జరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులోని కేవీకే శాస్త్రవేత్తలు 2023లో 2,518 భూసార పరీక్షలు చేసి రైతులకు ఇచ్చినందుకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

- రైతులతో అధికారుల సమావేశం
- ఉన్నతాధికారులకు పంపిస్తామని వెల్లడి

ములుగు, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు భరోసా అమలుకు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రగతి, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులు సాగుచేసే ప్రతీ ఎకరానికి పెట్టుబడి సాయాన్ని అందించాలని కొందరు, 10 ఎకరాలకు మాత్రమే పరిమితి విధించి రైతు భరోసా అందించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, భాగ్య, యాదయ్య, రాములుగౌడ్, కళమ్మ, అనంతరెడ్డి, వెంకటేశం, సత్తయ్య, ఏఈవో పృథ్వీ, పీఏసీఎస్ సిబ్బంది స్వరూప, అశోక్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించాలని పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

● **సిద్దిపేట అర్బన్:** రైతుబంధు అమలుపై అభిప్రాయ సేకరణలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతు వేదికలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేష్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో పాల్గొన్న రైతులు ఐదు ఎకరాలకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని మరి కొంతమంది రైతులు 10 ఎకరాల వరకు సాగు చేసుకున్న వారికి రైతుబంధు ఇవ్వాలని తమ అభిప్రాయాన్ని తెలిపినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రాజశేఖర్‌వర్మ, మండల వ్యవసాయశాఖ అధికారి పరుశురాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **వర్గల్:** వర్గల్ మండలంలో వ్యవసాయశాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రైతు భరోసా ద్వారా ఆర్థిక చేయూత అందించాలన్న లక్ష్యంతో ఏ విధంగా ఆర్థిక చేయూత అందిస్తే ప్రయోజనం చేకూరుతుందన్న అంశంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శేషశయన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణరెడ్డి, జిల్లా సహకార సంఘం అధికారి రఘోత్తంరెడ్డి, పీఏసీఎస్ డైరక్టర్లు వెంకటేశ్, రాములు, యాదగిరి, ఆనంద్, కిసర యాదగిరి, సీఈవో జితేందర్‌రెడ్డి, ఏఈవో భారతితో పాటు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, భూమిరెడ్డి, పోచయ్య, రాములు, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.



వర్గల్‌లో పీఏసీఎస్ కార్యాలయంలో అభిప్రాయాలు సేకరిస్తున్న ఏవో శేషశయన



సిద్దిపేట అర్బన్: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పనులను వేగవంతం చేయాలి

● ఎంపీపీ బాలేశంగౌడ్



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ

జగదేవ్‌పూర్, జూన్ 29: అమ్మ ఆదర్శ పనులను పాఠశాలలో వేగవంతం చేయాలని ఎంపీపీ బాలేశంగౌడ్ పేర్కొన్నారు. జగదేవ్‌పూర్‌లో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతుల పనులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో అభివృద్ధి కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా నిధులు మంజూరు చేసిందని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు. పాఠశాలలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా మరమ్మతు పనుల్లో జాప్యం కొనసాగుతున్నదని ఆరోపించారు. వెంటనే కాంట్రాక్టర్లు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలను అందించాలి

● కలెక్టర్ మనుచౌదరి



ములుగులో ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు, జూన్ 29: రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం ములుగులో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడు నర్సరీల్లో 8 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను పెంచారని, అవి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని హార్టికల్చర్ అధికారి సువర్ణ కలెక్టర్‌కు వివరించారు. వానకాలం సీజన్ ప్రారంభమైనందున ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు సరఫరా చేయాలని కలెక్టర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి శంకర్, ములుగు నర్సరీ ఇన్‌చార్జి శ్రీకర్, హార్టికల్చర్ అధికారులు అనిల్, సౌమ్య తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు

● ఏడీఏ పద్మ

చిన్నకోడూరు, జూన్ 29: రైతులు పచ్చిరొట్ట (జీలుగ, జనుము) సాగు చేయడం ద్వారా నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ పద్మ పేర్కొన్నారు. మండలంలోని అల్లీపూర్, మైలారం, కిష్టాపూర్ గ్రామాల్లో పచ్చిరొట్ట, వరి నారుమడులను, ఆయిల్‌పామ్ తోటలను శనివారం ఆమె ఏవో జయంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మ రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో భూమి కాలుష్యం కాకుండా ఉంటుందని, భావితరాలకు ఎలాంటి రసాయనిక ఎరువులు లేని నాణ్యమైన ఆరోగ్యవంతమైన ఆహార పంటలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో గౌతమి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పశువుల పేడతో కంపోస్టు ఎరువులు

నారాయణరావుపేట, జూన్ 29: పశువుల పేడతో నాణ్యమైన కంపోస్టు ఎరువులు తయారు చేసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి వెంకటరమణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పశువుల పెడతో తయారు చేసే ఎరువుల గురించి రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. పాడి రైతులు పశువుల పేడను వినియోగించినట్లయితే భూమి సారం పెరగడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ నిపుణులు నాగరాజు, ఏఈవో నాగార్జున్ పాల్గొన్నారు.



నారాయణరావుపేట: రైతులతో మాట్లాడుతునన వ్యవసాయ అధికారులు

మొక్కలు నాటే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కార్యదర్శి షఫీ ఉల్లాఖాన్

గజ్వేల్, జూన్ 29: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి షఫీ ఉల్లాఖాన్ సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో పల్లెప్రకృతివనం, నర్సరీని, దాచారంలోని అవెన్యూ ప్లాంటేషన్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల మొక్కల పెంపకం సంరక్షణ, నర్సరీ రిజిస్టర్ల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో అనువైన చోట, కమ్యూనిటీ స్థలాల్లో మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అయనవెంట డీపీవో దేవకీదేవీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో దయాకర్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, ఏపీవో సురేందర్, టీఏ వెంకట్‌రెడ్డి, ఎఫ్‌ఏ జ్యోతి ఉన్నారు.

పండ్ల మొక్కల పెంపకం బాగుంది

సిద్దిపేట రూరల్, జూన్ 29: వనమహోత్సవం కార్యాక్రమంలో భాగంగా పెంచిన సీతాఫలం, మామిడి మొక్కలు చాలా బాగున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి షఫీ ఉల్లాఖాన్ కితాబునిచ్చారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో వనమహోత్సవంలో నాటిన మొక్కలను సందర్శించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో బాలకృష్ణ, డీపీవో దేవకిదేవి, ఏపీడీ శివాజీ, ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, డీవీవో ప్రభాకర్, ఎంపీవో హరిప్రసాద్, క్యాసీ సంతోష్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఉన్నారు.



సిద్దిపేట రూరల్: నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేక కార్యదర్శి షఫిఉల్లాఖాన్

పౌరహక్కులపై అవగాహన అవసరం

● ఎస్‌ఐ సీహెచ్ తిరుపతి



కోహెడలో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిరుపతి

కోహెడ/సిద్దిపేట రూరల్/చేర్యాల, జూన్ 29: రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతినెలా ఓ గ్రామంలో ప్రభుత్వం పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నదన్నారు. హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేందర్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ మైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఖమ్మం స్వరూపవేంకటేశం, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, మాజీ సర్పంచులు దొమ్మట జగన్‌రెడ్డి, మంద రాజయ్య, వేల్పుల వెంకటస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం, సీపీఐ మండల కార్యదర్శి ముంజ గోపి, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల జాన్, దళిత సంఘాల నాయకులు బందెల కిషన్, రాగుల శ్రీనివాస్, శంకర్, సంపత్, మంద నారాయణ, తలారి అనిల్, రెవెన్యూ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని ఆర్‌ఐ బాలయ్య సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం బండచేర్లపల్లిలో శనివారం అధికారులు పౌరహకుల దినం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. గ్రామంలో కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. గ్రామంలో రెండు గ్లాసుల విధానం ఉండకూడదని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రలేఖ, జూనియర్ అసిస్టెంట్ రమేష్, కానిస్టేబుల్ రాకేష్, మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలం గుర్జకుంటలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేశ్, తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రవీందర్, హెడ్‌కానిస్టేబుల్ నరేందర్ పాల్గొన్నారు. పౌరుల హక్కులకు భంగం కలిగించకుండా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ల సీజ్

సిద్దిపేట క్రైం, జూన్ 29: సిద్దిపేట పట్టణంలోని లింగారెడ్డిపల్లి నుంచి సిద్దిపేటకు వస్తున్న టిప్పర్ (ఏపీ 28 ఎక్స్ 7414)ను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ కాంతం శ్రీనివాస్, యజమాని ముల్క మల్లేష్‌యాదవ్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండడంతో సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నర్సాపూర్ చౌరస్తా వద్ద టిప్పర్ (టీఎస్ 29టీఏ 1743)లో డ్రైవర్ పిల్లి లింగం, యజమాని కొంగరి శ్రీకాంత్ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండడంతో వారిపై కూడా కేసు నమోదు చేశారు.

హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

కొండపాక/చేర్యాల, జూన్ 29 : సిద్దిపేటలో జూలై 28న జరిగే ఆఫ్ మారథాన్ పోస్టర్‌ను శనివారం కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5కేఎం, 10 కేఎం, 20 కేఎం కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి అమరేందర్‌రెడ్డి పేర్కొన్నాడు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్ పోటీల పోస్టర్‌ను శనివారం చేర్యాల సర్కిల్ స్టేషన్‌లో సీఐ శ్రీను ఆవిష్కరించారు. చేర్యాల సర్కిల్ పరిధిలోని విద్యార్థులు, యువత, వయోబేధం లేకుండా పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ దామోదర్, అమరేందర్, దామోదర్, మీస వెంకటేశ్వర్లు, మారెల్ల భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షుల నియామకం

దూళిమిట్ట/మద్దూరు, జూన్ 29: కాంగ్రెస్ దూళిమిట్ట మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా మండల కేంద్రానికి చెందిన చల్లా లక్ష్మీని నియమిస్తూ, శనివారం చేర్యాల పట్టణంలోని కొమ్మూరి నివాసంలో ఆమెకు నియామక పత్రాన్ని సిద్దిపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీరెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, దూళిమిట్ట గ్రామశాఖ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, పాల్స శ్రీను, నాచగోని మహేష్, పాల్స రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం మద్దూరు మండలాధ్యక్షురాలిగా మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన గుండెగోని లలితమల్లేశం నియామకమయ్యారు. ఈ మేరకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మ్యాక మల్లేశం, జిల్లా నాయకులు కామడి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో హిందీ పోస్టుకు దరఖాస్తులు

కొండపాక, జూన్ 29: ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో హిందీ సబ్జెక్టు బోధించుటకు అవర్లీ బేస్డ్ ప్రకారం పనిచేయడం కోసం ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వన్నీసా తెలిపారు. అర్హత కలిగిన వారు సర్టిఫికెట్లతో జూలై 4న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేయాలి

- కేటాయింపుపై సమగ్రంగా విచారణ జరపాలి
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సాధన కమిటీ సభ్యులు, సీఐటీయూ నాయకులు

గజ్వేల్, జూన్ 29: గజ్వేల్ పట్టణంలో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందజేయాలని సిద్దిపేట జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవో అబ్దుల్ రెహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. స్థానికంగా రేషన్‌కార్డులు, గుర్తింపు కార్డులు లేకున్నా, సొంతంగా స్థలాలు, భూములు, బిల్డింగులు ఉన్నవారికి గత ప్రభుత్వం డబల్ బెడ్ రూం ఇళ్లకు ఎంపిక చేసిందని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలన్నారు. అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన ఒంటరి మహిళలు, దివ్యాంగులకు, నిరుపేదలకు, గతంలో సర్టిఫికెట్ పొందిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డబల్ బెడ్ రూం సాధన కమిటీ నాయకులు నర్సింహులు, పద్మ, కవిత, లక్ష్మి, వెంకటేష్, మహేందర్, సంపత్, రాము, నరహరి, సుక్కయ్య, మంజుల తదితరులున్నారు.

రేపు చిన్నకోడూరు మండల సర్వసభ్య సమావేశం

చిన్నకోడూరు/గజ్వేల్, జూన్ 29: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జనార్ధన్ శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమయానికి హాజరుకావలని సూచించారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, జూన్ 29జూలై 1న గజ్వేల్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. పట్టణంలోని ఐఓసీలో సోమవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ అధ్యక్షురాలు దాసరి అమరావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు, అధికారులు సమయానికి హాజరుకావాలన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

చేర్యాల, జూన్ 29: చేర్యాల పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ సోదరుడు మేడిశెట్టి బాలరాజు (56) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తపరిచారు. మృతదేహంపై పూలమాలవేసి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, నాయకులు ముస్త్యాల కిష్టయ్య, పుర్మ వెంకట్‌రెడ్డి, ఉడుముల భాస్కర్‌రెడ్డి, అవుశర్ల యాదయ్యతో పాటు ఆయా రాజకీయ పార్టీ, కులసంఘాల నాయకులు, ఉపాధ్యాయసంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతుని జీర్ణించుకోలేక మిత్రులు దుఃఖంలో మునిగిపోయారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

● మండల వైద్యాధికారి హరిత

వర్గల్, జూన్ 29: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతని మండల వైద్యాధికారి హరిత పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని శనివారం మండల పరిధిలోని అవుసులోనిపల్లి జవహర్ నవోదయ విద్యాలయం, మహాత్మా జ్యోతిబాపూలే మహిళా కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహణ కల్పించారు. దోమల వల్ల వ్యాపించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం కళాశాల ప్రాంగణాల్లో దోమల నివారణకై టీయెంపాస్ మందును పిచకారి చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

పరిమళించిన మానవత్వం



శునకానికి నీళ్లు తాగిస్తున్న సీఐ

సిద్దిపేట అర్బన్, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ వస్తున్న నేపథ్యంలో సిద్దిపేట రాజీవ్ రహదారిపై 3 టౌన్ పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తులో భాగంగా విధి నిర్వహణలో ఉన్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్‌కు గాయపడి నడవలేని స్థితిలో శునకం కనిపించింది. దీంతో ఆయన శునకం వద్దకు వెళ్లి నీళ్లు తాగించి బిస్కెట్స్ అందించి, చికిత్స కోసం ఆస్పత్రికి పంపించారు. విధి నిర్వహణ చేస్తూ మరోపక్క మానవత్వంతో మూగజీవికి చేసిన సేవలను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డిపోలో వ్యాసరచన పోటీలు

సిద్దిపేట అర్బన్, జూన్ 29: లక్షే లక్ష్యంలో భాగంగా శనివారం సిద్దిపేట డిపోలో లక్షే లక్ష్యంపై వ్యాసరచన పోటీలు, సంస్థ ప్రయాణికులకు, ఉద్యోగులకు అందిస్తున్న రాయితీలు, సౌకర్యాల గురించి చిన్నచిన్న నాటికలు ప్రదర్శించామని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యత ప్రదర్శించిన మహిళా ఉద్యోగులను ప్రశంసించి సన్మానించారు. వ్యాసరచన పోటీలోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

హుస్నాబాద్, జూన్ 29: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపును శనివారం నిర్వహించారు. హుండీ ద్వారా రూ. 9,79,279 ఆదాయంతో పాటు మిశ్రమ బంగారం, మిశ్రమ వెండి, రెండు విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. గత సంవత్సర ఆదాయం రూ. 8,05,385 రాగా ఈసారి రూ. 1,73,894 అధికంగా వచ్చింది. ఈ లెక్కింపులో ఈవోపీ కిషన్‌రావు, దేవాదాయ ధర్మదాయశాఖ పరిశీలకుడు వి. రంగారావు, గోమాత సేవా పరిషత్, ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు, పూదరి లక్ష్మీనారాయణ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, పున్న సమ్మయ్య ఉన్నారు.

ఫోన్ అందజేత



ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేట రూరల్, జూన్29: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అందజేసినట్లు సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. చింతమడకకు చెందిన కేమ్మసారం చంద్రం తన ఫోన్ పోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, సీఈఐఆర్ ద్వారా ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి అందజేశామని అన్నారు.

'కొమ్మూరి'ని కలిసిన జూనియర్ కళాశాల అధ్యాపకులు

చేర్యాల, జూన్ 29: చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, అధ్యాపక బృందం శనివారం జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాల స్థితిగతులను వివరించారు. ఎన్నోఏళ్ల చరిత్ర ఉన్న జూనియర్ కళాశాలకు సుమారు రెండేళ్లక్రితం బాలికల వసతిగృహం మంజూరైనప్పటికీ, సంబంధితశాఖ అధికారులు ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని వివరించారు. మౌలిక వసతుల కల్పనతో కూడిన భవనం కేటాయింపచేసి హాస్టల్ ప్రారంభానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా, ఈవిషయమై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి ఖండించారు. ఎలాంటి అధికారంలేని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వడం సబబుకాదని పేర్కొన్నారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

ములుగు, జూన్ 29: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వంటిమామిడిలో అన్నాసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డితో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు రైతుబంధు, రుణమాఫీ విషయంలో ప్రజలను పక్కదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నాయని ఆరోపించారు. వారివెంట జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్‌సలీం, శంకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

మద్దూరు, జూన్ 29: మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లోని అనుమానిత ప్రదేశాల్లో పోలీసులు శనివారం నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాల బ్లాక్‌స్పాట్లు గుర్తించి తనిఖీలు చేశామన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తుపదార్థాల నిర్మూలనకు చర్యలు చేపట్టామన్నారు.

నర్సాయపల్లి యువతికి అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగం



భానుశ్రీ

మద్దూరు, జూన్ 29: మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె భానుశ్రీ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్ష రాసిన భానుశ్రీ రాష్ట్రస్థాయిలో 109వర్యాంకు సాధించి ఉద్యోగం కైవసం చేసుకున్నది. ఈమేరకు ఆమెను స్థానికులు అభినందించారు.

చెత్త విభజనపై అవగాహన



అవగాహన కలిపిస్తున్న ఆకుల రజిత

హుస్నాబాద్, జూన్ 29: హుస్నాబాద్ పట్టణంలోని బస్ డిపో వెనక కాలనీలో శనివారం బసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరై చెత్త విభజనపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వార్డు కౌన్సిలర్ చిత్తారి పద్మ, శ్రీలత, రవికుమార్, శంకర్, సృజన్, సాంబరాజు వైద్య సిబ్బంది తదితరులున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

గజ్వేల్, జూన్ 29: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆయా సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఆంగ్లం, సంస్కృతం, తెలుగు, కంప్యూటర్ సైన్స్, గణితం, మైక్రోబయాలజీ సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు కావాలన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు జూలై 2న కళాశాలలో ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. నెట్, సెట్, ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు..

చేర్యాల, జూన్ 29: కొమురవెల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్‌పోస్టు తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 400మందికి వంట చేయగల సామర్థ్యం ఉండటంతో పాటు ఏడో తరగతి చదివిన స్థానిక మహిళ అర్హురాలని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు జూలై 7వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9505754157నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం ఉంటేనే భవిష్యత్తు'

కుకునూరుపల్లి, జూన్ 29: ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం ఉంటేనే విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని తలకొక్కుల చంద్రకళ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో వంద మంది విద్యార్థులకు ఇంగ్లిష్ నిఘంటువులను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లి చంద్రకళ పేరు మీదుగా విద్యార్థులకు తమ వంతుగా సహాయం చేద్దాం అనే ఉద్దేశంతో నిఘంటువులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, పీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్, ట్రస్ట్ సభ్యులు దుర్గాప్రసాద్, మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.